

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | గురువారం 2, ఏప్రిల్ 2026 | సంపుటి :16 సంచిక :14 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00



2 లో..

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్ సభ ఆమోదం...

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బుధవారం 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026'ను సభలో ప్రవేశపెట్టారు.



2 లో..

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు: కిషన్ రెడ్డి

అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది.



2 లో..

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు..

### నిర్దోషిగా తేల్చడాన్ని సవాలు చేసిన ఈడీ

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈడీ జారీ చేసిన సమన్లకు ఆయన హాజరుకాకపోవడంతో దాఖలైన కేసుల్లో ట్రయల్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది.

## ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు

# తేడా ఏమీ లేదు

**ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయే**

**బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు: కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి**

కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు.

వార్త 2లో



## నాటో నుంచి తప్పుకునే అంశాన్ని పరిశీలిస్తున్నాం

నాటో నుంచి తప్పుకునే అంశాన్ని తమ దేశం పరిశీలి స్తున్నట్లు అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ) సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధంలో నాటో దేశాలు తమకు సహకరి ంచడం లేదని ట్రంప్ ఆరోపించారు. ఈ మేరకు నాటో నుంచి అమెరికా వైదొలిగే ఆలోచనలో ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక చర్యకు మిత్రదేశాలు మద్దతు ఇవ్వడం లేదని.. వాళ్లు విఫలమైనందు వల్లే ఆ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.నాటో కూటమిని కాగితపు పులిగా అభివర్ణించారు ట్రంప్. నాటో విశ్వసనీయతపై తనకు ఎప్పటి నుంచో చాలా సందేహాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు.

వార్త 2లో



## న్యూస్ వార్ క్యాలెండరు ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్

న్యూస్ వార్ ప్రతినిధి నల్లగొండ :

న్యూస్ వార్ వార్తాపత్రిక ముద్రించిన శ్రీ పరాభవ నామ సంవత్సర తెలుగు క్యాలెండరును నల్గొండ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ చేత న్యూస్ వార్ చీఫ్ ఎడిటర్ నటవ కృష్ణారావు ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలుగు నెలల ఆధారంగా క్యాలెండరును ముద్రించటం హర్షించ తగిన విషయమని అన్నారు. ఈ ఆవిష్కరణ కార్యమాక్రమంలో సబ్ ఎడిటర్ బొల్లేపల్లి హరికృష్ణ, సంస్థ చీఫ్ ఎడిటర్ కృష్ణారావు బాల్యమిత్రుడు గోవర్ధన్ రెడ్డి (ఐటి సెల్) మరియు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు








2 లో..

## దేశమంతటా యూపీఐ సేవలు డౌన్.. యూజర్ల అసహనం!

దేశవ్యాప్తంగా నేడు డిజిటల్ చెల్లింపు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నించిన అనేకమంది వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపించింది.ఔటేజ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం, ఒక్కసారిగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

# ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదు

## ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయే

### బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు: కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శించారు. కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారని వ్యాఖ్యానించారు. కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ ఓటు బ్యాం కును ఎల్డీఎఫ్‌కు బదిలీ అయ్యేలా చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేరళలో పినరయి విజయన్ సమయం అయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడానికి అవకాశమే లేదని అన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయేనని అన్నారు.



# అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్ సభ ఆమోదం... రాజ్యసభ ముందుకు బిల్లు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బుధవారం 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు–2026'ను సభలో ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం, ఈ బిల్లు ఆమోదం పొందినట్లు ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. తెలుగుదేశం, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు బిల్లుకు మద్దతు పలకగా, వైసీపీ ఎంపీలు చర్చ మధ్యలో సభ నుంచి వాకౌట్ చేశారు. 2024 జూన్ 2 నుంచి ఈ సవరణ వర్తించేలా బిల్లులో పొందుపరిచారు. ఈ చట్ట సవరణతో రాష్ట్రానికి అమరావతి ఏకైక రాజధానిగా చట్టపరమైన భద్రత లభిస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, "అమరావతి రైతుల కన్నీళ్ల మీద ఈ చట్టం నిర్మాణమైంది. ఇది ఆంధ్ర ప్రజల కలల రాజధాని" అని అన్నారు. బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, "అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగానే ఉంటుంది" అని స్పష్టం చేశారు. లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రేపు గురువారం (ఏప్రిల్ 2) రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. పెద్దల సభలో కూడా ఆమోదం పొందితే, రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారనుంది. దీంతో గతంలో వచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనకు చట్టపరంగా తెరపడినట్లవుతుంది.

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు: కిషన్ రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఉందని అన్నారు. దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీజేపీ తరపున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

# దేశమంతటా యూపీఐ సేవలు డౌన్.. యూజర్ల అసహనం!

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

దేశవ్యాప్తంగా నేడు డిజిటల్ చెల్లింపు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నించిన అనేకమంది వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపించింది. ఔటేజ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం, ఒక్కసారిగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క ఎస్‌బీఐ ఖాతాదారుల నుంచే 500కు పైగా ఔటేజ్ రిపోర్టులు రాగా, యూకో బ్యాంకుకు సంబంధించి దాదాపు 40 ఫిర్యాదులు నమోదయ్యాయి. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, జైపూర్, పుణె వంటి ప్రధాన నగరాలతో పాటు కోల్‌కతా, గువాహటి, చెన్నై నుంచి కూడా వినియోగదారులు లావాదేవీలు విఫలమయ్యాయని తెలిపారు. ఈ సమస్యపై చాలామంది ఎక్స్ వేదికగా తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. కొందరి లావాదేవీలు మధ్యలోనే ఆగిపోగా, మరికొందరి యూపీఐ యాప్‌లు పూర్తిగా లోడ్ అవ్వలేదు. ఈ అంతరాయంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. షెడ్యూల్ ప్రకారం చేపట్టిన నిర్వహణ పనుల సమయాన్ని ఏప్రిల్ 1వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల వరకు పొడిగించినట్లు తెలిపింది. "ఈ సమయంలో యూపీఐ, ఐఎంపీఎస్, యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవల్లో అంతరాయం కలగవచ్చు," అని పేర్కొంది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు యూపీఐ లైట్, ఈ-రూపీ (సీబీడీసీ) యాప్, ఏటీఎం సేవలను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచించింది.

# కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు.. నిర్దోషిగా తేల్చడాన్ని సవాలు చేసిన ఈడీ

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈడీ జారీ చేసిన సమన్లకు ఆయన హాజరుకాకపోవడంతో దాఖలైన కేసుల్లో ట్రయల్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈడీ తరపున న్యాయవాది జొహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినా, ఆయన తరపున ఎవరూ హాజరుకాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించడం ద్వారా ట్రయల్ కోర్టు తీవ్రమైన తప్పిదం చేసిందని వాదించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద జారీ చేసిన సమన్లు ఆయనకు అందినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం, కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది. అలాగే, ట్రయల్ కోర్టు రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. గతంలో పీఎంఎల్‌ఏ సెక్షన్ 50 కింద ఈడీ జారీ చేసిన ఐదు సమన్లను కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఈడీ రౌస్ అవెన్యూ కోర్టులో ఫిర్యాదు చేసింది. అయితే, ఈ ఫిర్యాదులను విచారించిన అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పరాస్ దలాల్, కేజ్రీవాల్‌పై విచారణ కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ ఆయనను నిర్దోషిగా ప్రకటించారు. ఈ తీర్పునే ఇప్పుడు ఈడీ హైకోర్టులో సవాలు చేసింది. ఇదే సమయంలో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన అవినీతి కేసులో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కూడా హైకోర్టులో విచారణలో ఉంది. ఈ కేసు విచారణను జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం నుంచి మరో బెంచ్‌కు బదిలీ చేయాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించడం గమనార్హం.

# నాటో నుంచి తప్పుకునే అంశాన్ని పరిశీలిస్తున్నాం: ట్రంప్

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

నాటో నుంచి తప్పుకునే అంశాన్ని తమ దేశం పరిశీలి స్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ) సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధంలో నాటో దేశాలు తమకు సహకరించడం లేదని ట్రంప్ ఆరోపించారు. ఈ మేరకు నాటో నుంచి అమెరికా వైదొలిగే ఆలోచనలో ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇరాన్‌పై అమెరికా– ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక చర్యకు మిత్రదేశాలు మద్దతు ఇవ్వడం లేదని.. వాళ్లు విఫలమైనందు వల్లే ఆ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. నాటో కూటమిని కాగితపు పులిగా అభివర్ణించారు ట్రంప్. నాటో విశ్వసనీయతపై తనకు ఎప్పటి నుంచో చాలా సందేహాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా బ్రిటన్ యుద్ధనౌకల దుస్థితిపై ట్రంప్ నేరుగా విమర్శలు గుప్పించారు. 'మీకు నావికాదళమే లేదు. మీరు చాలా పాతబడిపోయారు. పైగా మీ వద్ద పనిచేయని విమాన వాహక నౌకలు ఉండేవి' అని ఎద్దేవా చేశారు. యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ రక్షణ వ్యయాన్ని పెంచాలా? అని సదరు రిపోర్టర్ ప్రశ్నించగా.. తానేమీ సలహా ఇవ్వనని, ఆయనకు నచ్చింది చేసుకోవచ్చన్నారు.

### ట్రంప్ వ్యాఖ్యలపై యూకే ప్రధాని..

ట్రంప్ వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌ను సదరు పత్రిక ప్రశ్నించగా.. నాటోకు తమ దేశం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. నాటో కూటమిని ఇప్పటివరకూ ప్రపంచం చూసిన అత్యంత సమర్థవంతమైన ఏకైక సైనిక కూటమిగా ఆయన అభివర్ణించారు. కొన్ని రోజులుగా తనపై, నాటో దేశాలపై ఎంతో ఒత్తిడి ఉందన్నారు. తాను తీసుకునే ఏ నిర్ణయమైనా బ్రిటిష్ జాతీయ ప్రయోజనాల కోసమే అని స్టార్మర్ స్పష్టం చేశారు.

# ఎన్డీయే వస్తే తమిళనాడును దక్షిణ ప్రదేశ్‌గా మార్చేస్తారు: స్టాలిన్

తిరుచ్చి:

తమిళనాడు అభివృద్ధికి డీఎంకే తిరిగి అధికారంలోకి రావడం తప్పనిసరని రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ (వీఖ ణ్ఖుశ్రీఱఅ) అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే–బీజేపీ కూటమిని చిత్తుగా ఓడించి దానిని బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్, మణిపూర్ తరహాలో తమిళనాడులో అల్లర్లు సృష్టించేందుకు కాషాయం పార్టీ కుట్ర పన్నిందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనిపించే ఘర్షణలు, మూకదాడులు తమిళనాడులో లేవని, కాషాయం పార్టీ కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. ఎన్డీయే అధికారంలోకి వస్తే తమిళనాడు పేరును 'దక్షిణ ప్రదేశ్'గా మార్చేందుకు కూడా వెనుకాడదని ఓటర్లను హెచ్చరించారు. తిరుచ్చి జిల్లా నుంచి బుధవారంనాడు ఎన్నికల ప్రచారాన్ని స్టాలిన్ ప్రారంభించారు. జిల్లా నుంచి సెక్యులర్ ప్రొగ్రసివ్ అలయెన్స్ తరపున పోటీ చేస్తున్న 9 మంది అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం సాగించారు. రాజ్యసభలో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను ఆమోదించడం ద్వారా మైనారిటీలు, శ్రీలంక తమిళులను అన్నాడీఎంకే, పీఎంకే వంచించాయని స్టాలిన్ విమర్శించారు. 'అప్పట్లో సీఏఏ ప్రభావం ఏ ఒక్కరిపై పడదని పళనిస్వామి సమర్థించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి మైనారిటీ ఓట్ల కోసం సీఏఏ ఒక చారిత్రక తప్పిదం అంటూ మాట్లాడారు. ఇప్పుడు ఆయనను ఒక ప్రశ్న అడుగుతున్నాను. సీఏఏకి మీరు మద్దతిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? మీకు ధైర్యం ఉంటే బహిరంగంగా దీనిపై సమాధానం ఇవ్వాలి' అని సవాల్ విసిరారు.

### పడయప్ప డైలాగ్..

అన్నాడీఎంకే ఎన్డీయే కూటమికి నాయకుడైతే, చిన్న పార్టీలు అన్నాడీఎంకే రెండాకుల గుర్తుపై కాకుండా బీజేపీ కమలం గుర్తుపై ఎందుకు పోటీ చేస్తున్నాయని స్టాలిన్ నిలదీశారు. 'పడయప్ప' చిత్రంలోని ఓ డైలాగ్‌ను స్టాలిన్ ప్రస్తావిస్తూ 'పెళ్లికొడుకు ఈయనే.. కానీ ఆయన వేసుకున్న డ్రస్సు నాదే' అన్నట్టు అన్నాడీఎంకే పరిస్థితి ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం తమిళనాడులో ఎన్డీయే ప్రభుత్వం వస్తుందని చెబుతున్నారనే కానీ, ఈపీఎస్‌ను ముఖ్యమంత్రిని చేస్తామని కానీ, అన్నాడీఎంకే పేరు కానీ ప్రస్తావించడం లేదన్నారు.

### ఏడోసారి కూడా మనమే..

డీఎంకే ఏడోసారి కూడా అధికారంలోకి వస్తుందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ద్రవిడియన్ మోడల్ గవర్నమెంట్ కొనసాగుతుందన్నారు. ఎన్డీయే, ఆ కూటమి బానిసైన అన్నాడీంకే అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని ఊహించని కడగండ్లపాలు చేస్తారని, తమిళనాడు తమిళనాడు లాగానే ఉండాలి కానీ, ఉత్తర్‌ప్రదేశ్, మణిపూర్ తరహాలో హింసాత్మకంగా మారకూడదన్నారు. ఇందుకోసం తమిళనాడు రాష్ట్రం మొత్తం ఒకటిగా నిలిచి బీజేపీ–అన్నాడీఎంకే కూటమిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ద్రవిడయన్ మోడల్ ఇంజిన్ అనేది సూపర్–ఫాస్ట్ ఇంజిన్ అని, బీజేపీ డబ్బా మోడల్ ఇంజిన్ ముందు తలవంచదని స్పష్టం చేశారు.

# రంగారెడ్డిలో అక్రమంగా నిర్మించిన ఐదంతస్థుల భవనం కూల్చివేత

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా పరిధిలోని శాస్త్రిపురం కాలనీలో అక్రమంగా నిర్మించిన ఐదంతస్థుల భవనాన్ని హైడ్రా అధికారులు కూలగొట్టారు. శాస్త్రపురం కాలనీలో సర్వే నెంబర్ 134/20లో సుమారు 6500 గజాల విస్తీర్ణంలో ఉన్న పార్క్ స్థలాన్ని కబ్జా చేసి భారీ భవన నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణంపై హైడ్రా అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసుల బందోబస్తు మధ్య హైడ్రా సిబ్బంది ఆపరేషన్ ప్రారంభించారు. అక్రమంగా నిర్మించిన నాలుగు నుండి ఐదు అంతస్తుల భవనాలను జెసిబిల సహాయంతో కూల్చివేశారు. పూర్తిగా నేలమట్టం చేస్తూ అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ చర్యలతో కాలనీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెరుగుతాయా: కేంద్ర ప్రభుత్వం ఏం చెప్పిందంటే?

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు భారీగా పెరిగినప్పటికీ, దేశీయ ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలలో సమీప భవిష్యత్తులో ఎలాంటి మార్పు ఉండబోదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ బుధవారం స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశంలో వాణిజ్య సిలిండర్ ధర పెరిగిన విషయం తెలిసిందే. ఇతర దేశాల్లోని పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. దీనితో త్వరలో ధరలు పెరుగుతాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం



నుంచి కీలక ప్రకటన వెలువడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, దేశీయ వినియోగదారులకు పాత ధరలకే ఇంధనం అందుబాటులో ఉంటుందని తెలిపింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల సిలిండర్ ధరలను పెంచే ఉద్దేశం ప్రస్తుతానికి లేదని స్పష్టం చేసింది. వాణజ్య సిలిండర్ ధర స్వల్పంగా పెరిగిందని, దీనివల్ల సాధారణ గృహ వినియోగదారులపై ప్రభావం పడదని తెలిపింది. వాణిజ్య సిలిండర్ ధరలు పెరిగినప్పుడల్లా డొమెస్టిక్ సిలిండర్ల ధరలు పెరుగుతాయనే అపోహ సరికాదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో రెండు నెలలకు సరిపడా పెట్రోలియం నిల్వలు అందుబాటులో ఉన్నట్లు తెలిపింది.

# రెండ్రోజుల తర్వాత మళ్లీ కళకళలాడిన భారత స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నాడు భారీ లాభాలతో ముగిశాయి. గత రెండు రోజులుగా కొనసాగుతున్న నష్టాలకు బ్రేక్ పడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,186.77 పాయింట్లు లాభపడి 73,134.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 348 పాయింట్లు పెరిగి 22,679.40 వద్ద క్లోజ్ అయింది. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న ఆశలతో మార్కెట్లు ఉదయం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. అయితే, సెషన్ చివరి గంటల్లో ఆ ఉత్సాహం కొంత తగ్గడంతో సూచీలు ఆరంభ లాభాల్లో కొంత భాగాన్ని కోల్పోయాయి. అయినప్పటికీ, చివరికి ప్లస్‌లోనే ముగియగలిగాయి. బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మరింత మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 2.24 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 3.24 శాతం చొప్పున పెరిగాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా లాభపడింది. కెమికల్, మీడియా రంగాల్లోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. అయితే, మార్కెట్ ట్రెండ్‌కు విరుద్ధంగా నిఫ్టీ హెల్త్‌కేర్, ఫార్మా రంగాలు నష్టాలతో ముగియడం గమనార్హం. టెక్నికల్ అంశాలపై విశ్లేషకులు స్పందిస్తూ, నిఫ్టీ 22,500 స్థాయిని నిలబెట్టుకోకపోతే అమ్మకాల ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎగువన 23,000 స్థాయి కీలక నిరోధకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# జగన్ క్రిమినల్ క్రెడిట్‌ను ఎవరూ కొట్టేయలేరు

## అభివృద్ధిని ఓర్వలేకనే ప్రభుత్వంపై జగన్ విమర్శలు

## మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

**అమరావతి,**

జగన్ క్రిమినల్, దోపిడీ విధ్వంసాల క్రెడిట్‌ను ఎవరూ చోరీ చేయలేరని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. తన ఐదేళ్ల పాలనలో చేసింది చెప్పుకునేందుకు ఏమీ లేక చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధిని క్రెడిట్ చోరీ చేసేందుకు జగన్ యత్నిస్తున్నారని విమర్శించారు. జగన్ అబద్దాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ఆయన సైకో బ్యాచ్ పరితపిస్తోందని మంత్రి అన్నారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో చంద్రబాబు చరిత్రకారుడిగా గుర్తుండిపోతే.. జగన్ చరిత్రహీనుడిగా మిగిలిపోతారని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. జగన్ అవినీతి క్రెడిట్‌ను ఎవరూ చోరీ చేయలేరంటూ మంత్రి ఎద్దేవా చేశారు. కడప స్టీల్ ప్లాంట్ పూర్తి చేయలేని క్రెడిట్ జగన్‌దేనని అన్నారు. రాష్ట్రానికి విధ్వంసకారుడు, దోపీడీదారుడనే క్రెడిట్ జగన్‌కు మాత్రమే సొంతమన్నారు. సొంత బాబాయ్‌ను హత్యచేసి పిన్నమ్మ తాళిబొట్టు తెంచిన కేసులో జగన్ ఆడిన డ్రామాల క్రెడిట్ కూడా ఎవరూ చోరీ చేయలేరని చెప్పారు. కన్నతల్లి, సొంత చెల్లిని రోడ్డున పడేసిన క్రెడిట్ ఎవ్వరూ కోరుకోరు కూడా అని వ్యాఖ్యలు చేశారు. ల్యాండ్, సాండ్, మైన్, వైన్, గంజాయ్ వంటి క్రెడిట్‌లతో యువత సహా ఎందరో జీవితాలను జగన్ నాశనం చేశారని మండిపడ్డారు. దుర్మార్గమైన ఆలోచనలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి.. 151స్థానాలు వచ్చిన పార్టీని 11కు దిగజార్చిన క్రెడిట్ ఒక్క జగన్‌ది మాత్రమేనంటూ మంత్రి విమర్శించారు. అమరావతి తీర్మానంపై సమాధానం చెప్పలేక, కుటిల రాజకీయాలకు పాల్పడుతున్న వైసీపీ నేతలకు ఇక పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. వైసీపీ భవిష్యత్తు ఇక అంధకారమే అని అన్నారు. కుల, మత, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ వైసీపీ పన్నే కుట్రలు ఇక పారవన్నారు.



సంపాదకీయం...

# ఇది యుద్ధాల యుగం కారాదు

**ఇప్పుడు సాగుతున్న యుద్ధాలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ యుద్ధాలు శాశ్వతం కావడం ప్రపంచ దేశాలు ఎంత సంక్షోభంతో అల్లాడుతున్నాయో మనం చూస్తున్నాం. ఇరాన్, లెబనాన్, పశ్చిమాసియాలోని డజను అరబ్ దేశాల్లో క్షిపణులు, డ్రోన్లతో బాంబుల దాడులు ఏమాత్రం తగ్గడం లేదు. ఏప్రిల్ 6 వరకు ఇరాన్ అణుశక్తి ప్లాంట్లపై దాడులు జరపబోమని అమెరికా తాత్కాలిక విరామం ప్రకటించింది. గాజాలో శిథిలమైన జీవితాలను నిలబెట్టుకోడానికి అక్కడి జనం పోరాడుతుంటే, ఉక్రెయిన్‌లో భౌగోళిక రాజకీయ ఆధిపత్యం కోసం సైన్యాలు యుద్ధం సాగిస్తున్నాయి. గాజా విధ్వంసం 'ప్రపంచం మరిచిపోతున్న యుద్ధం'గా మారుతుండగా, ఉక్రెయిన్ యుద్ధం నిరంతర మారణహోమంగా కొనసాగుతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఇజ్రాయెల్ అమెరికా తిరస్కరించడం వల్ల ఇరాన్ యుద్ధానికి దారి తీసి చమురు, గ్యాస్ రవాణా స్తంభించింది. ఇది ఆదర్శమే కాదు అవసరమే ఈ పరిణామాలే కనుక లేకుంటే సోమాలియాలో జరిగిన సైనిక చర్యలు వంటివి కేవలం శత్రుత్వంతో జరిగిన దురదృష్టకర సంఘటనలుగా మాత్రమే పరిగణించబడేవి. ఇరాన్ తన అద్భుతమైన యుద్ధ సామర్థ్యంతో అరబ్ దేశాలపై దాడి చేస్తూ హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు, గ్యాస్ రవాణాను అడ్డుకుంటోంది. ఇరాన్ అణుసామర్థ్యాన్ని అడ్డుకునే నెపంతో అమెరికాఇజ్రాయెల్ దేశాలు ఈ యుద్ధాన్ని మొదలు పెట్టినప్పటికీ ఇప్పుడు అది కేవలం చమురు రవాణా మార్గాలను తెరచి ఉంచడానికి జరిగే పోరాటంగా మారిపోయింది.**

ఈ యుద్ధం నుండి బయటపడడానికి అమెరికా ప్రయత్నిస్తున్నా ఇజ్రాయెల్‌ను ఒప్పించలేకపోతోంది. శాంతి ప్రయత్నాల పేరుతో అమెరికా 15 డిమాండ్లను ఇరాన్ ముందుకు తెచ్చింది. ఒప్పందం కుదురుతుందని అందరూ భావించారు. కానీ అది ఇరాన్‌కు లొంగిపోయే డాక్యుమెంట్‌గా చిత్రీకరించబడ్డది. అరబ్ దేశాలను ఇరాన్ తీవ్రంగా దెబ్బతీయడమే కాక, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేయకుండా ఏ నౌకలు ఈ మార్గం ద్వారా వెళ్లాలో, ఏ నౌకలు వెళ్లకూడదో నిర్ణయిస్తూ టోల్‌బూత్ విధానాన్ని అమలు చేస్తోంది. బంగ్లాతో బంధం బలోపేతం కావాలి అమెరికా, ఇజ్రాయెల్ వారి మిత్ర దేశాల నౌకలను అడ్డుకుంటోంది. చైనా, భారత్ వంటి దేశాల నౌకలకే అనుమతిస్తోంది. దీనివల్ల తూర్పు దేశాలకు ముఖ్యంగా ఆసియా దేశాలకు ముడి చమురు, సహజవాయువు (ఎల్ఎన్‌జి) సరఫరా సాగడం లేదు. ఈ పరిస్థితి 1970నాటి ఇంధన సంక్షోభాన్ని గుర్తు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై తమకే సార్వభౌమత్వాన్ని కల్పించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తోపాటు ఐదు ప్రతీకార డిమాండ్లను ఇరాన్ ప్రతిపాదించిందంటే ఇక ఒప్పందం అన్న మాటకు అవకాశమే లేదని అర్థం చేసుకోవాలి. యుద్ధం ఎటు వెళ్తోందో తెలియని స్థితిలో అమెరికా ఉంది. తన మిత్రదేశం ఇజ్రాయెల్‌కు ఒకవైపు మద్దతు ఇస్తూనే, మరోవైపు యుద్ధం వల్ల కలుగుతున్న నష్టాన్ని తగ్గించుకోవడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ యుద్ధం మొదట్లో ఇరాన్ అణుబాంబు టార్గెట్‌లను అణచివేయడం, ఇరాన్ పాలనలో మార్పు తీసుకురావడం, తదితర లక్ష్యాలతో ప్రారంభమైంది. కానీ ఇప్పుడు ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి దిగ్బంధాన్ని తొలగించడమే ప్రధాన లక్ష్యంగా మారింది. నియోజకవర్గాల పునర్విభజనలో సమన్యాయమే శ్రేయస్కరం యుద్ధానికి ముందు ఈ మార్గం నిరంతరం తెరిచే ఉండేది. ఇదెంత హాస్యాస్పదమో అన్న విమర్శలు అందరి నోటా వినిపిస్తున్నాయి. కానీ ట్రంప్ కుటుంబ సభ్యుల సంప్రదింపుల బృందానికి, స్నేహితులకు కేబినెట్ సహచరులకు మాత్రం ఇదేమీ అనిపించడం లేదు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికా వైమానిక దాడులు జరగడానికి 48 గంటల ముందే ఇరాన్ తన అణు కార్యకలాపాలపై చర్చకు సిద్ధమని, 60 శాతం వరకు సుసంపన్నం చేసిన 440 కిలోల యురేనియంను వదులుకోడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ సంకేతాలిచ్చినా ఇజ్రాయెల్ అమెరికా పట్టించుకోకుండా దుస్సాహసంతో దాడులు ప్రారంభించారని అమెరికా దౌత్యవేత్తలు కొందరు ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ యుద్ధం ఇరాన్, రష్యా దేశాలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించే వాణిజ్యంగా సాగుతోంది. చమురు విక్రయాలపై ఆంక్షలు సడలించడంతో రోజుకు 140 మిలియన్ డాలర్లను సంపాదించగలుగుతున్నామని ఇరాన్ చెబుతోంది. రష్యాకు కూడా ఇదే విధమైన ప్రయోజనం చేకూరుతోంది. రష్యా తన చమురును ఎవరికైనా విక్రయించుకునేలా వెసులుబాటు లభించడంతో రష్యా అధ్యక్షుడు పుతిన్ లాభాల పంటను పండించుకుంటున్నారు. దీంతో ఉక్రెయిన్‌తో మరింత పోరు సాగించడానికి ఆర్థిక ఊతం మరింత లభించినట్టయింది. ఇరాన్ భూభాగంలో కానీ, ఇరాన్ అధీనంలో ఉండే ఖర్గ్ ద్వీపంలో కానీ అమెరికా దురాక్రమణకు పాల్పడితే ప్రపంచ దేశాలు మరింత సంక్షోభానికి గురవుతాయి. హోతీ వర్గాలకు స్థావరంగా తయారైన ఎర్రసముద్రం మార్గాన్ని కూడా అష్టదిగ్బంధనం చేస్తామని అమెరికా ఇజ్రాయెల్ దేశాలను ఇరాన్ హెచ్చరిస్తోంది. ఈ పరిస్థితుల్లో సుదీర్ఘమైన 'ఎండ్‌గేమ్' ప్రణాళికను ట్రంప్ రూపొందించడం కంటే శాశ్వత యుద్ధ స్థితి అనే ఊబిలోనుంచి బయటపడడానికి దౌత్యమార్గాల ద్వారా ప్రయత్నాలు సాగించడం శ్రేయస్కరం. ఇదే విధంగా ఇరాన్ కూడా స్థిరమైన నిరంకుశ రాజకీయాలు, యుద్ధ వ్యూహాలతో తమ ప్రతిఘటన సామర్థ్యం నిరూపించుకోవడం కంటే అణుబాంబుల తయారీ అనేది తెలివి తక్కువ నిర్ణయమని, తాము ఆ దిశంగా వెళ్లడం లేదని ప్రపంచానికి చాటిచెప్పేలా స్పష్టమైన హామీ ఇవ్వడం ప్రపంచ క్షేమానికి దారి చూపుతుంది.



# మౌనిక హత్య కేసులో దర్యాప్తుముమ్మరం

### హత్యకు ముందే కత్తులు కొనుగోలు చేసిన రవీంద్ర

### డబ్బుల కోసం వేధింపులు తట్టకోలేక హత్య చేసినట్లు వెల్లడి

**విశాఖపట్టణం,**

విశాఖపట్నంలోని ఎల్.వి.నగర్‌లో దారుణ హత్యకు గురైన యువతి మౌనిక (29) కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో నిందితుడు చింతాడ రవీంద్రకు డేటింగ్ యాప్‌లో మౌనిక పరిచయమైనట్లు తెలిసింది. ఆమెకు రూ.3.50లక్షల ఇచ్చినట్లు రవీంద్ర తెలిపాడు. డబ్బు కోసం మౌనిక వేధించేదని.. హింస భరించలేకే ఆమెను హతమార్చినట్లు పోలీసులకు చెప్పాడు. గాజువాక ప్రాంతంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో ఒక యువతిని హత్య చేసిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గాజువాక 70వ వార్డు పరిధిలోని ఎల్‌బీ నగర్‌లో ఈ ఘటన జరిగింది. ఈ హత్యతో గాజువాక ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి.. నేవీ ఉద్యోగి అయిన ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన నేవీ ఉద్యోగి రవీందర్ తన ప్రియురాలిని ఇంటికి పిలిపించి దారుణంగా హత్య చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి.. కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో, మరో భాగాన్ని గోనె సంచిలో దాచాడు. ప్రియురాలిని దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితుడు స్వయంగా గాజువాక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. దాంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రవీందర్ ఇంటికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాదీనం చేసుకున్నారు. ఈ దారుణానికి కారణంగా కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత వివాదాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడు రవీందర్ భార్య పుట్టింటికి వెళ్లిన సమయంలో ప్రియురాలిని ఇంటికి పిలిపించుకొని ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్.వి.నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు మౌనికను రవీంద్ర పిలిచాడు. అక్కడికి వచ్చిన కాసేపటికే వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత ఆమెను రవీంద్ర కిరాతకంగా హతమార్చాడు. హత్యకు ముందే గాజువాకలో కత్తులు కొనుగోలు చేశాడు. మౌనికను చంపిన తర్వాత రక్తపు మరకలు కడిగేశాడు. రక్తపు వాసన రాకుండా ఇంట్లో సెంటు కొట్టాడు. శరీర భాగాలను ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో పెట్టాడు. తల, ఆమె ఫోన్‌ను దారపాలెం తోటల్లో తగులబెట్టాడు. అనంతరం స్నేహితుడికి ఫోన్ చేసి హత్య విషయాన్ని చెప్పాడు. స్నేహితుడు హెచ్చరించడంతో గాజువాక పోలీసులకు రవీంద్ర లొంగిపోయాడు.

# పాతబస్తీలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ

### దాడిచేసి సీజ్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,**

నగరంలో కలుషిత ఆహార పదార్థాల తయారీపై పోలీసులు మరోసారి కఠిన చర్యలు తీసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో నాసిరకం అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న కేంద్రంపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్ , హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా ఆకస్మిక దాడి నిర్వహించింది. పక్కా సమాచారంతో పోలీసులు ఐడీఏలోని తయారీ సంస్థ పై దాడి చేశారు. ఈ సందర్భంగా హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. తనిఖీల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రంలో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. ప్లాస్టిక్ డబ్బాల్లో, పరిశుభ్రతకు విరుద్ధంగా పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి పేస్ట్ తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్, గమ్ పౌడర్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. తయారు చేసిన పేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడంతో దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు తెలిపారు. ఈ పేస్ట్‌ను హోల్‌సేల్ కిరాణా దుకాణాలు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో నిందితుడు చెలగాటం ఆడుతున్నాడని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేట్ లేకుండానే లాభాపేక్షతో ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దాడిలో సుమారు రూ.22 లక్షల విలువైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 4,032 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్, 6,000 కిలోల నాసిరకం వెల్లుల్లి, 210 కిలోల నాసిరకం అల్లం, వెల్లుల్లి పొట్టు సంచులు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్, 5 గ్రైండింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితుడిని, స్వాధీనం చేసిన సామగ్రిని తదుపరి విచారణ కోసం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.

# నవనీత కృష్ణాలంకారంలో రాములవారు

### స్వామిని దర్శించుకుని పులకించిన భక్తులు

### ఒంటిమిట్ట కళ్యాణానికి తిరుమల శ్రీవారి లడ్డూ

**ఒంటిమిట్ట,**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఏప్రిల్ 1వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 85 వేల తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ 1లో శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్‌ను టీటీడీ ఒక బృహత్కార్యక్రమంగా నిర్వహించింది. ఈ లడ్డూల ప్యాకింగ్ కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు అపార భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి,డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లడ్డూ ప్యాకింగ్ నిరంతరాయంగా సాగింది. లడ్డూల ప్యాకింగ్, లోడింగ్, రవాణా వంటి అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు.

# బాణాసంచా బాధితులకు పరామర్శ

### మెరుగైన వైద్యం అందుతోందని మంత్రి కొల్లు వెల్లడి

**అమరావతి,**

కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో బాణసంచా ప్రమాద బాధితులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలవడం పట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డాక్టర్లకు సూచించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు మంత్రి హామీ ఇచ్చారు. దీపావళి సమయంలో అక్రమ వ్యాపారం చేసిన వారి వద్ద స్వాధీనం చేసుకున్న టపాసులను తరలిస్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని మంత్రి తెలిపారు. ముగ్గురు కూడా వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందుతోందని అన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం ఉదయం చల్లపల్లి పోలీస్ వాహనంలో పేలుడు సంభవించింది. దీపావళి సందర్భంగా సీజ్ చేసిన టపాసులను పోలీసు వాహనంలో తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. వాహనంలోని టపాసులు ఒక్కసారిగా పేలడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఎస్సై సహా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

# టపాసులు పేలుడు ఘటనపై మంత్రి వాసశెట్టి దిగ్భ్రాంతి

**అమరావతి,**

: కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన టపాసులు పేలిన ఘటనపై ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాశ్ స్పందిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో గాయపడిన పోలీసు సిబ్బందికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి గల కారణాలను తక్షణమే తెలుసుకుని పూర్తి స్థాయి విచారణ జరపాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ స్టేషన్లలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని మంత్రి ఆదేశించారు. సీజ్ చేసిన పేలుడు పదార్థాల నిల్వలో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిపై సమీక్షించారు. ప్రమాదానికి గురైన ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల్లో ఎలాంటి భయం అవసరం లేదని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా ఎస్పీతో మంత్రి వాసంశెట్టి సుభాశ్ ఫోన్లో మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుటున్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

## చండూరు యువత స్థలాన్ని వ్యాపారపరం చేయకండి

### కింగ్ స్టార్ యూత్ అసోసియేషన్



**న్యూస్ వార్ చండూర్ ఏప్రిల్ 1:**

గతంలో చండూరు పట్టణం సెంటర్ లో ఉన్నటువంటి యూత్ బిల్డింగ్ శిధిలా వ్యవస్థకు చేరడంతో ఆ ప్రాంతంలోనే బస్ స్టాప్ ఉండి జనసమ్మర్ధమైన ప్రాంతం కావడం వల్ల అప్పటి పాలకవర్గం ప్రజలకు అపాయం కలగకూడదనే ఉద్దేశంతో యూత్ బిల్డింగ్ కూల్చివేయడం జరిగినదని, గతంలో చండూరుకు ప్రభుత్వం నుండి కేటాయించబడిన శాఖ గ్రంధాలయానికి సరైన వసతులు కలిగిన భవనం దొరకకపోవడంతో ఆ యూత్ బిల్డింగ్ లోనే గతంలో శాఖ గ్రంధాలయాన్ని ఏర్పాటు చేశారు యువతకు గ్రంథాలయం యొక్క ఉపయోగం ఎంతగానో ఉండటంవల్ల గ్రంథాలయం ఏర్పాటుతోపాటు అందులోనే అప్పటి కళానికేతన్ యూత్ అసోసియేషన్ లాంటి యువజన సంఘాల వారు అనేక యువ కార్యక్రమాలను నిర్వహిస్తుండేవారనీ ఇలా యువతకు ఉపయోగపడిన అయూత్ బిల్డింగ్స్ స్థలంలో తిరిగి తాము యూత్ బిల్లింగ్ నిర్మాణం చేపట్టదలిచామని కింగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు చండూర్ పట్టణ మున్సిపల్ కమిషనర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినదని . అక్కడ ఎలాంటి కమర్షియల్ నిర్మాణాలు చేపట్టకుండా నేటి చండూరు యువతకు ఉపయోగపడేలా తిరిగి అదే స్థలంలో తాము నిర్మించబోయే యూత్ బిల్డింగ్ నిర్మాణానికి అనుమతి ఇవ్వవలసిందిగా కోరామని. కింగ్ స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులు పేర్ల గణేష్, పగిల్ల చంద్రశేఖర్, వేణు,సందీప్, సాయి, శంకర్, తెలియచేశారు.

## చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



**న్యూస్ వార్ చండూర్ ఏప్రిల్ 1:**

చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ కు ఎన్నికైన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఈరోజు జరిగింది. ఎన్నికల అధికారులు చెన్నూరి రాధా కిషన్ రావు మరియు కానుగుల వెంకటయ్య పాల్గొన్న ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గంచేత మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యశీ వెంకటాచలం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తాడూరు పరమేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో చౌటుప్పల్ పట్టణంలో మరో అడిషనల్ కోర్టు మరియు సబ్ కోర్టు ఎర్పాటుకు, శాశ్వత కోర్టు భవన నిర్మాణం కొరకు మరియు అడ్వకేట్ ఫెటర్నిటీ కోసం పాలకవర్గంతో కలిసి కృషి చేస్తానని, ఈ సందర్భంగా తెలియచేశారు. ఇట్టి కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శగా పడమటి మహిపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా పిట్టల బిక్షమయ్య, సహాయ కార్యదర్శిగా మక్తాల నరసింహ, లైబ్రరీ సెక్రెటరీగా నర్రి స్వామి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా దేశ గోని శ్రీశైలం, మహిళ ప్రతినిధిగా నకరికంటి జ్యోతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా ఎండి. ఖయ్యూం పాషా, పిల్లలమర్రి కిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉడుగు శ్రీనివాస్, ఎలమొని శ్రీనివాస్, ఎన్నికల అధికారులు సిహెచ్ రాధాకృష్ణ రావు, కానుగు వెంకటయ్య, న్యాయవాదులు రాపోలు వేణు, ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, జెల్ల రమేష్, బడుగు శ్రీకాంత్, జక్కర్తి శేఖర్, దాచేపల్లి చంద్రబాబు, బొంగు గోపాల్, రిక్కల సుధాకర్ రెడ్డి, కట్టెల లింగస్వామి, అవ్వారు చేతన్, పాల పరమేష్, జంగయ్య, శ్రీశైలం, భరత్ కుమార్, అయితేగొని శ్రీకాంత్, మల్లికార్జున్, విజయ్, మరియు కోర్టు సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చండూరు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీరాములు




# ప్రభుత్వం పాఠశాలల్లో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించలి

**న్యూస్ వార్ చౌటుప్పల్ ఏప్రిల్ 1**

దేవలమ్మ నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల విద్యాధికారి ఎలికట్ట గురువారావు పర్యవేక్షణలో నిర్వహించిన థియేటర్ వర్క్ షాప్ లో ప్రముఖ కవి, జాతీయస్థాయి రంగస్థలం దర్శకుడు శ్రీనివాస్ దెంచనాల మాట్లాడుతూ. గత 42 సంవత్సరాలుగా ఆధునిక నాటకాలను తెలుగులో 'జనపదం' పేరుతో ప్రదర్శిస్తున్నట్టు తెలిపుతూ ప్రభుత్వం పాఠశాలల్లో సాంస్కృతిక ఉత్సవాలు, కళా శిక్షణ శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికీ ఎన్నో పాఠశాలల్లో వేలమంది విద్యార్థులకు భావోద్వేగ ప్రదర్శన, దేహాన్ని సృజనాత్మకంగా వాడుకోవడం, కంఠ విన్యాసాలు, నటీనటుల ఊహాశక్తిని పెంచుకోవడం, కథ చెప్పడం మొదలైన కళల్లో తాను శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. సమాజంలోని హింస, దోపిడీ, అసమానతలు అంతమై ఒకరినొకరు అభిమానించుకునేలా పిల్లల్ని తీర్చిదిద్దాలన్నారు. కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా పాఠశాలల్లో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ వర్క్ షాప్ కు ప్రముఖ కవయిత్రి శివజ్యోతి సమన్వయకర్తగా వ్యవహరించాగా. 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా దెంచనాలను విద్యార్థులు ఉపాధ్యాయులు సత్కరించారు .



# ప్రతి నెల 100 కు పైగా ఫోన్స్ రికవరీ చేస్తున్న జిల్లా పోలీస్

జిల్లాలో చోరీకి గురైన ఫోన్లను ప్రతీ నెలల 100కు పైగా ఫోన్లను రికవరీ చేసి వాటిని యజమానులకు అందజేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె నరసింహ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు 20 లక్షల రూపాయల విలువ గల 106 ఫోన్ల ను గుర్తించి రికవరీ చేసి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా 11వ సారి సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు (భాదితులకు) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం, ఆర్థిక పరమైన అంశాలకు వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్ లో నిక్షిప్తం చేసుకుంటున్నాము అన్నారు, మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది. నేరగాళు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతున్నారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి చేశారు, ఇతర రాష్ట్రాల వారి నుండి ఈ మొబైల్స్ ను రికవరీ చేశారు. పోలీసు ప్రజల ఆస్తుల రక్షణలో అనుక్షణం ప్రజల పక్షాన పని చేస్తుంది, తప్పుడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు, నేరాలకు పాల్పడే వారికి ఫ్రెండ్లీ పోలీస్ ఉండదు, సామాన్యుల పట్ల మాత్రమే ఫ్రెండ్లీ పోలీస్ అన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే జజు×= పోర్టల్ ( ష్ట్రజూం://ఞఞఞ.ఎవఱతీ.స్త్రశీఙ.ఱఅ ) నందు నమోదు చేసుకోవాలి, మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు శాఖ కృత నిచ్చయంతో పని చేసి ఈరోజు పెద్దమొత్తంలో ఫోన్స్ రికవరీ చేసి ఇక్కడ భాదితులకు అందించడం జరిగినదన్నారు. అనంతరం పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరకదనుకున్న బాధితులు జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంభందిత బాధితులు జిల్లా ఎస్పీ, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో వివిధ రూపాల్లో వినియోగదారులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ ను జజు×= అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

### రోడ్డు భద్రత చర్యలు పాటించాలి

ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి, వాహనాలు నడిపేటప్పుడు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి, ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ఉద్యమం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కె నరసింహ తెలిపారు. రోడ్లపై ప్రయాణం చేసే సమయంలో అత్యంత అప్రమత్తంగా వాహనాలు నడపాలి, కుటుంబ పెద్ద కు రోడ్డు ప్రమాదం సంభవించి ప్రాణాలు కోల్పోయే కుటుంభం పెద్ద దిక్కు కోల్పోతుంది అన్నారు. రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసు శాఖ అరైవ్ అలైవ్ అనే భద్రత మహా ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రోడ్డు భద్రత అపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

### అత్యాశకు పోవద్దు

ప్రజలు అత్యాసకు పోయి సైబర్ మోసాల బారిన పడోద్దు తక్కువ వడ్డీకి లోన్స్ ఉన్నాయి, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు, బహుమతులు వచ్చాయి అంటే నమ్మి అపరిచితులకు డబ్బులు పంపవద్దు, వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు, మీ పిల్లలు డ్రగ్స్, అమ్మాయిల రవాణా లాంటి కేసుల్లో చిక్కుకున్నారు డిజిటల్ అరెస్ట్ చేస్తాం అని జదీ×, జ×ణ లాంటి దర్యాప్తు సంస్థల పేర్లు చెప్పి డబ్బులు కడితే కేసు నుండి తప్పిస్తాము అంటారు ఇది నమ్మవద్దు డిజిటల్ అరెస్ట్ అబద్ధం అన్నారు.

### ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీస్

పోలీసు మీకోసం ఉన్నారు. ప్రజా భద్రతలో అనుక్షణం కృషి చేస్తున్నాము, మీ ప్రాంతాల్లో జరుగుతున్న అశాంఘిక చర్యలు, అక్రమ రవాణా పై పోలీసుకు సమాచారం ఇవ్వాలి, సమాజంలో జరుగుతున్న అసాంఘిక చర్యలు, అక్రమాలు, అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రశ్నించే ప్రతిఒక్కరు యూనిఫాం లేని పోలీసు, వీటిపై మాకు సమాచారం ఇవ్వండి మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం అన్నారు, ప్రజలు పోలీసులకు మిత్రులుగా ఉంటూ నేరాల నివారణలో భాగస్వామ్యం కావాలి అన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ సైబర్ వారియర్స్, డ్రగ్స్ నిర్మూల వారియర్స్ లాగా ఉండాలి వీటిపై సమాచారం ఇస్తే మీరు పోలిసుతో భాగస్వామ్యం అయినట్లే, సైబర్ మోసాల గురించి చుట్టుపక్కల వారికి అవగాహన కలిగించాలి. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, మొబైల్ పోగొట్టుకున్న బాధితులు ఉన్నారు.



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,